క్లుప్తంగా

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించండి



సి.బెళగల్ బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్‌గా శ్రీనివాసరెడ్డి, డీటీ పురుషోత్తం

సి.బెళగల్: సి.బెళగల్ తహసీల్దార్‌గా శ్రీనివాస రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్‌గా పురుషోత్తం విధుల్లో చేరారు. అనంతరం తహసీల్దార్‌తోపాటు డీటీకి రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం డీటీతో కలిసి తహసీల్దార్ అధికారులు, సిబ్బంది, సర్వే సహాయకులతో సమావేశమయ్యారు. ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఈ సందర్భంగా తహసీల్దార్ సూచించారు.

సేంద్రియ ఎరువులతో లాభాలు

సి.బెళగల్: రైతులు వరి పంటల సాగులో సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే అధిక లాభాలను పొందవచ్చని ఏఓ మల్లేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలం పరిధిలోని కొండాపురం గ్రామంలో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌లో భాగంగా మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది వరి పొల్లాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు వరి పంట సాగువిధానంపై అవగాహన కల్పిస్తూ, పెట్టు బడిలేని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఏఓ వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు వెంకటేష్, సోమేశ్వరి, వీఏఏ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు గోరంట్ల గురుకుల విద్యార్థి



విద్యార్థి హాజీబాషా

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి హాజీ బాషా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్‌-14 లాంగ్ జంప్, హైజంప్ పోటీల్లో విద్యార్థి హాజీ బాషా అద్భుతమైన ప్రతిభను కనబర్చి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ రామాంజినేయులు తెలిపారు. హాజీబాషాతో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు రాజును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈఓఆర్డీ సులోచన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ సుంకమ్మ గర్భిణులు, బా లింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు తప్పనిసరిగా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, డాక్టర్ల సూచనలు పా టించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు కూర గాయలు, ఆకుకూరల ప్రదర్శన చేశారు. తదనంతరం పౌష్టికాహారం ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అంగన్‌వాడీ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు.

నేడు రైతుబజారుకు సెలవు

కర్నూలు(అగ్రికల్చర్): సి.క్యాంపు రైతుబజారుకు ఈ నెల 27న (శుక్రవారం) ఒక్క రోజు సెలవు ప్రకటించినట్లు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. నిత్యం రైతులు, వినియోగదారులతో రద్దీగా ఉండే రైతుబజారును క్లీనింగ్ చేసేందుకు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు, రైతులు గమనించాలని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి యథావిధిగా రైతుబజారు పనిచేస్తుందని పేర్కొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కర్నూలు కల్చరల్: శ్రీ దీప్తి యాడ్స్ సురేష్ కుమార్ జిల్లా గ్రంథాలయానికి పుస్తకాలను ప్రదానం చేశారు. గురువారం జిల్లా కేంద్రాలయంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌కు ఐఐటీ, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ దాత కుమార్ రూ. 20 వేల విలువ గల నూతన పుస్తకాలను గ్రంథాలయానికి ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలోని పాఠకులు, ప్రజలు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసు కోవాలన్నారు.కార్యక్రమంలో లైబ్రేరియన్ వజ్రాల గోవింద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చి... పక్కన పెట్టి !

- భూముల రీ సర్వేపై టీడీపీ ప్రభుత్వ తీరు
- 'ఏపీ సర్వే ప్రాజెక్ట్‌పై తొలగని సందిగ్ధత
- పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు
- క్రయ, విక్రయాలకు ఇబ్బంది పడుతున్న రైతులు



కాలురులో రోవర్ ద్వారా రీ సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

పాణ్యం: టీడీపీ ప్రభుత్వంలో రైతులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. కూటమి సర్కార్ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి భూ సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన భూముల రీ సర్వే పథకాన్ని పక్కన పెట్టిన టీడీపీ ప్రభుత్వం ఆ స్థానంలో 'ఏపీ సర్వే ప్రాజెక్ట్' అంటూ పేరు మార్చిందే తప్పా విధివిధానాలు వెల్లడించకపోవడంత సందిగ్ధత నెలకొంది. దీంతో క్రయ, విక్రయాలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020లో 'జగనన్న భూ హక్కు భూ రక్ష' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చింది. ప్రభుత్వమే ఉచితంగా కొలతలు వేసి హద్దులు చూపి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఆధునాతన పరికరం రోవర్ సాయంతో బ్రిటిష్ కాలం నాటి హద్దులను అనుసంధానం చేసుకుని సర్వేయర్లు పొలాలకు సర్వే చేశారు. రైతులకు రూపాయి ఖర్చు లేకుండా అన్ని ప్రభుత్వమే భరించింది. ఈ మేరకు రీ సర్వే వేగంగా సాగింది కూడా. రీ సర్వే అనంతరం రైతులు ఏమైనా అభ్యంతరాలు చెబితే వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులను నియమించింది గత ప్రభుత్వం. ఏళ్లతరబడి నెలకొన్న భూ సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్న నేపథ్యంలో 2024సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. రైతుల భూములను ప్రభుత్వం లాగేసుకుంటుందని అసత్యారోపణలతో విస్తృతంగా ప్రచారం చేసిన కూటమి నేతలు సత్ఫలితాలే సాధించారు. అధికారం చేపట్టిన టీడీపీ సర్కార్ భూముల రీ సర్వేను పక్కన పెట్టడంతో పొలాల క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. 'జగనన్న భూ హక్కు భూ రక్ష' పేరును 'ఏపీ సర్వే ప్రాజెక్ట్'గా పేరు మార్చిన కూటమి సర్కార్ విధివిధానాలు వెల్లడించకపోవడంతో రైతులు అయోమయానికి గురువుతున్నారు.

14 గ్రామాల్లో పూర్తి

మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉండగా అందులో 14 గ్రామాలలో భూముల రీ సర్వే పూర్తి అయ్యింది. మిగిలిన నాలుగు గ్రామాల్లో ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. మండలంలో మొదట కొత్తూరును పైలెట్ గ్రామంగా ఎంపిక చేసుకుని భూముల రీ సర్వే పనులు ప్రారంభించారు. పొలం వద్దనే రైతులు లేవనెత్తిన సమస్యలను సర్వేయర్లు పరిష్కరించారు. ఇంకా కొన్నింటిని పరిష్కరించాల్సి ఉంది. భూములకు సర్వే నంబర్లకు బదులు ఎల్‌పీ నంబర్లు కేటాయించారు. రీ సర్వే నిలిచిపోవడంతో రైతులు విన్నవించిన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

> **ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు**
>
> ప్రస్తుతం ఏపీ సర్వే ప్రాజెక్ట్‌కు సంబధించి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతంలో రీ సర్వే చేసిన తర్వాత రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపాం. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ కూడా చేశాం. నిబంధనల మేరకు అన్ని సమస్యలు పరిష్కరించాం. పాణ్యం మండలంలో 14 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశాం. పొలాల విస్తీర్ణం, మొత్తం నంబర్లు, రీ సర్వే తర్వాత విస్తీర్ణం, ఎల్‌పీఎంస్‌లు, ఖాతాలు, పరిశీలించి రైతులు అంగీకారంలో రాళ్లు పాతాం. ప్రస్తుతం రీ సర్వేకు సంబధించి అర్జీలు వస్తున్నప్పటికీ అధికారుల నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.
>
> –మహేశ్వరరెడ్డి, రీ సర్వే డీటీ

టీడీపీ, జనసేన నాయకుల మధ్య ఘర్షణ





టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ జనసేన నాయకులు చాంద్ బాషా, సొహేల్ బాషా

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో గురువారం టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ఘర్షణ పడ్డారు. టీడీపీ నాయకులు తాహెర్ బేగ్, ముజుబుల్ బేగ్, సోఫీ బేగ్‌తోపాటు మరికొందరు జనసేన నాయకులు చాంద్ బాషా, సోహేల్ బాషా ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డారు. తమపై కర్రలు, రాళ్లతో దాడి చేసి గాయపరిచారని జనసేన నాయకులు చాంద్ బాషా, సోహేల్ బాషా తెలిపారు.కొంతకాలంగా ఈ రెండు కుటుంబాల మధ్య గ్రామంలోని హోటల్‌కు సంబంధించి ఘర్షణ పడుతున్నారు. జనసేన నాయకులపై దాడి చేసిన సోఫీ బేగ్ వర్గీయులు టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరులుగా కొనసాగుతున్నారు. దాయాదులైన ఈ రెండు కుటుంబాలు వర్గాలుగా విడిపోయి కొట్టుకున్నారు.తా లూకా పోలీసులు గ్రామం చేరుకుని సర్దుబాటు చేశారు. ఇరువర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఓంకార యాదవ్

ఓర్వకల్లు:పాఠశాల విద్యార్థులకు అర్థయమ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ సూచించారు. మండలంలోని పూడిచెర్ల గ్రామం జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫామ్, విద్యార్థుల కిట్లు పంపిణీ తదితర అంశాలపై ఆరాతీశారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి పాఠ్యాంశాలపై విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. తదనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో జరిగిన సంస్కరణలను దృష్టిలో పెట్టుకొని సెంట్రల్ సిలబస్‌పై పుస్తకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విజయలక్ష్మి, శైలజ పాల్గొన్నారు

అభివృద్ధి ప్రణాళికలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ శ్యామల

సి.బెళగల్: మండల అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన ఎంపీడీఓ రాముడు విజన్ స్వర్ణాంధ్ర 2027పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రనిధులు, నాయకులు, యువకులు గ్రామాల అభివృద్ధికి తమవంతు సలహాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఎంపీడీఓతోపాటు ఈఓఆర్డీ సందీప్, ఏఎస్‌ఓ ఆదినారాయణ తదితరులు గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ రంగా లక్ష్మిదేవి

కోడుమూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేయాలని జేడీఏ, మండల స్పెషలాఫీసర్ రంగా లక్ష్మిదేవి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 'వికసిత్ ఆంధ్ర 2047' ప్రణాళికలో భాగంగా ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల కలిసికట్టుగా పనిచేసి రానున్న ఐదేళ్లలో చేపట్టబోయే పనుల వివరాల నివేదికను తయారు చేయాలన్నారు. అలాగే రానున్న వద రోజుల్లో గ్రామాల్లో చేపట్టబోయే పనుల వివరాలను కూడా ఇవ్వాలని ఆమె సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఎస్‌ఓ చంద్రమౌళి, ఏఈ గంగరాజు, హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో మద్దిలేటిపై సస్పెన్షన్ వేటు

కర్నూలు (సెంట్రల్) : గతంలో కల్లూరు వీఆర్వోగా పనిచేస్తూ ప్రస్తుతం దేవనకొండ మండలం తెర్నెకల్లు -2 వీఆర్వోగా పనిచేస్తున్న కురువ మద్దిలేటిపై వేటు పడింది. ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో కలెక్టర్ సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. కల్లూరు వీఆర్వోగా ఉన్న సమయంలో మద్దిలేటి అనేక అక్రమాలకు పాల్పడ్డారని అభియోగం ఉంది. కర్నూలు ఆర్డీవోను నియమించి విచారణ జరిపించారు. ప్రాథమికంగా కొన్ని అభియోగాలు నిజం కావడంతో తాత్కాలికంగా ఇటీవల తెర్నెకల్లు-2 వీఆర్వోగా నియమించారు. అయినా, అతనిపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజాసంఘాల ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో తాజాగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన కల్లూరు వీఆర్వోగా ఉన్నప్పుడు పలు భూ అక్రమాల్లో పాలుపంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ వివరాలన్నీ పూర్తిస్థాయి విచారణలో బయటకు రావలసి ఉంది.

కలెక్టరేట్ ఏఓగా బాధ్యతలు చేపట్టిన విజయశ్రీ



కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)గా ఐ.విజయశ్రీ బాధ్యతలు చేపట్టారు. ఇ టీవల చేపట్టిన బదిలీల్లో ఆమె సి.బెళగళ్ తహసీల్దార్ స్థానం నుంచి కలెక్టరేట్ ఏఓగా నియమితులయ్యారు. ఈక్రమంలో గురువారం ఆమె ఏఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మరోవైపు ఇక్కడ ఏఓగా ఉన్న పి.రాజేశ్వరి కలెక్టర్ సీ సెక్షన్ హెచ్‌ఓడీగా బదిలీ అయ్యారు. ఆమె కూడా విధుల్లో చేరారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఏఓ కలెక్టర్, జేసీ, డీఆర్వోలను మర్యాద పూర్వకంగా కలిశారు.

నివాళి

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పరదేశి ఏసన్న(95)అనారోగ్యంతోమృతి చెందాడు. మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చా రు. అదేవిధంగా గ్రామానికి చెందిన పి. రాజశేఖర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. పి. రాజశేఖర్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

రైఫిల్ షూటింగ్ క్రీడాకారులకు ఏకాగ్రత అవసరం



రైఫిల్ షూటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు

కర్నూలు (టౌన్) : రైఫిల్ షూటింగ్ క్రీడాకారులకు ఏకాగ్రత అవసరమని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు స్పష్టం చేశారు. గురువారం స్థానిక అశోక్‌నగర్‌లోని రైఫిల్ షూటింగ్ అకాడమిలో ఎస్‌జీఎఫ్ అండర్‌-14, 17 బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్‌-19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, క్రీడాసంఘాల ప్రతినిధులు బాషా, సుధీర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లెప్రసి బాధితులకు వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో లెప్రసి వ్యాధితో ప్రభావితమైన వారికి, దివ్యాంగులకు వృత్తి విద్యా కోర్సుల్లో విజయనగరంలో భోజన వసతులతో శిక్షణ ఇవ్వనున్నట్లు డీఎస్‌ఎంఓ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి చెప్పారు. గురువారం జిల్లా లెప్రసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి ప్రతి ఒక్క డీపీఎంఓ కూడా లెప్రసి మిషన్ విజయనగరం వారికి పూర్తి సహకారం అందించాలని తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఐటీఐ కోర్సుల్లో భాగంగా డీజిల్ మెకానిక్, వెల్డింగ్, కంప్యూటర్, ఎలక్ట్రీషియన్, డ్రస్ మేకింగ్ వంటి కోర్సులలో శిక్షణ ఇస్తామన్నారు.లెప్రసి మిషన్ కార్యనిర్వహణాధికారి గేబ్రియల్ మాట్లాడుతూ విజయనగరంలో స్త్రీ, పురుషులకు వేర్వేరు వసతి గృహాలు ఉన్నాయని, 10వ తరగతి ఉత్తీర్ణులై 16 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు వారు ది లెప్రసి మిషన్ ట్రస్ట్ ఇండియా, ప్లాటినం ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్, చెల్లూరు పోస్టు, విజయనగరం జిల్లాకు రావాలన్నారు. వివరాలకు సీహెచ్‌వై. నాయుడు(9441568293), ఎన్. రాజు(9502514431)కు ఫోన్ చేయాలని సూచించారు.

28న రేబిస్ దినోత్సవం నిర్వహించాలి

కర్నూలు(హాస్పిటల్): రేబిస్ వ్యాక్సిన్‌ను కనుగొన్న లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28వ తేదీన ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రేబిస్ వ్యాధి గురించి ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం నినాదం 'రేబిస్ సరిహద్దులను బద్దలు చేయడం అని వచ్చిందన్నారు. ఏఆర్‌టీ, ఏఆర్‌ఎస్ వ్యాక్సిన్లు ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచామన్నారు. 2024లో ఇప్పటి వరకు 7,028 కుక్కకాటు కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీరందరికీ వ్యాక్సిన్ వేయడంతో ఎలాంటి మరణాలు సంభవించలేదని తెలిపారు.

వరద బాధితులకు విరాళం

కర్నూలు(సెంట్రల్): విజయవాడ వరద బాధితులకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు విరాళాలు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఒక్కో టీచర్ రూ.60, ఒక్కో హెల్పర్ రూ.40 ఇచ్చేందుకు అంగీకారం తెలిపినట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జె.లలితమ్మ తెలిపారు.ఈ మేరకు గురువారం సంఘం ఆధ్వర్యంలో వేతనాల్లో డబ్బులు తీసుకోవాలని కోరుతూ ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్.మునెప్ప, ఇతర నాయకులు పాల్గొన్నారు.

జోగులాంబ దసరా ఉత్సవాలకు రండి

- కలెక్టర్‌కు ఆహ్వానం అందించిన ఈఓ పురేందర్ కుమార్



కలెక్టర్ రంజిత్‌బాషాను సన్మానిస్తున్న ఈఓ పురేందర్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): ఐదో శక్తిపీఠంగా విరాజిల్లుతున్న జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ ఆహ్వానం అందించారు.గురువారం సాయంత్రం కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో కలసి 3వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈఓ ఆహ్వానానికి కలెక్టర్‌ను సానుకూలత వ్యక్తం చేశారు. కాగా, దసరా శరన్నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున కర్నూలు జిల్లా కలెక్టర్ పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

ఆర్‌యూలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు బ్లడ్ గ్రూపింగ్



బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్‌లో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వలంటీర్లు

కర్నూలు కల్చరల్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రారంభించిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా గురువారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. నాగరాజు మాట్లాడుతూ కర్నూలు బ్లడ్ బ్యాంక్ సహకారంతో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో 250 మంది వలంటీర్లకు బ్లడ్ గ్రూపింగ్ చేయించామన్నారు. బాధ్యత గల పౌరులుగా యువత తమ బ్లడ్ గ్రూప్‌పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అవసరమైన సందర్భాల్లో రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆర్‌యూసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరిప్రసాద్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ బి. విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ స్ఫూర్తిగా పోరాటాలు

- విద్యార్థినులకు నోటు పుస్తకాల వితరణ



నోటు పుస్తకాల వితరణ కార్యక్రమంలో నేతలు, ఉపాధ్యాయులు

కర్నూలు(అర్బన్): తెలంగాణలోని పెత్తందార్లు, రజకార్లకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నిర్మించిన చిట్యాల ఐలమ్మ స్ఫూర్తిగా రజకులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని రజక విద్యా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీపీ వెంకటేష్ కోరారు. గురువారం విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక పెద్దమార్కెట్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఐలమ్మ జయంతి సందర్భంగా విద్యార్థినులకు నోటు పుస్తకాల వితరణ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రజక జాతిని ఎస్సీ జాబితాలో చేర్చేవరకు ఉద్యమించాలన్నారు. వీరమాత ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని బాలికలు విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన బాలికలకు విద్య చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు సూర్యకుమారి, రాయలసీమ రజక సాధికార కమిటీ కన్వీనర్ సీహెచ్ లింగమయ్య, మహిళా కన్వీనర్ రేణుకమ్మ, సీనియర్ నాయకులు శంకరన్న, లీగల్ అడ్వైజర్ జగదీష్‌బాబు, బాపనపల్లె రాధమ్మ, చంద్రకళ, రమణ, ఆనంద్, రవి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై కక్ష సాధింపు హేయమైన చర్య



తొలగించిన కుళాయి పైపును పరిశీలిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామంలో దళితులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం హేయమైన చర్య అని ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో కుళాయి పైపులను టీడీపీ నాయకులు దౌర్జన్యంగా తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. తర్వాత మంచినీటి ట్యాంకు నుంచి తొలగించిన కుళాయి పైపును పరిశీలించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ జిల్లా మానటరింగ్ కమిటీ మాజి సభ్యులు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక, జిల్లాలో దళితులపై దాడులు, హత్యయత్నాలు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. నాయకుల అండదండలతో పల్లెల్లో రాజకీయ కక్షసాధింపులకు పాల్పడడం అన్యాయమన్నారు. ఎస్సీ కాలనీ శివారు గృహాల వారు ట్యాంకు నుంచి తమ సొంత డబ్బులతో పైపులైన్ వేసుకుని తాగునీటిని పొందుతుంటే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక ఆ పైపును తొలగించడం సరికాదన్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీని కలవనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెడు స్పర్శలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న హేమలత

కర్నూలు(హాస్పిటల్): చెడు స్పర్శలపై బాలికలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి హేమలత చెప్పారు. గురువారం నగర శివారులోని లక్ష్మీపురం గ్రామంలోని కేజీబీవీ స్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ జాతీయ కౌమార ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా 4వ గురువారం కౌమారుల ఆరోగ్య దినోత్సవం నిర్వహించి ఒక్కొక్క అంశం గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల అంశం మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ముఖ్యంగా భుజం తట్టడం, తలమీద ఆశీర్వదించడం, కరచాలనం చేయడం వంటివి మంచి స్పర్శలని అలాగాకుండా ఛాతి, పెదాలు, మెడ, నడుము, నడుము కింది భాగం తాకడం వంటివి చెడు స్పర్శలని తెలిపారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చెడు స్పర్శకు సంబంధించి ఎవ్వరైనా తాకినప్పుడు విద్యార్థినులు వెంటనే ప్రతిఘటించి వారి నుంచి దూరంగా వెళ్లి కుటుంబ పెద్దలకు, ఉపాధ్యాయురాలి దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ పద్మావతమ్మ, కేజీబీవీ కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త పద్మావతమ్మ, ఆశా కార్యకర్త మాధవి పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు దీక్షలు

కర్నూలు(సెంట్రల్): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబర్ 1,2,3 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా కార్మిక, రైతు, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపడుతున్నట్లు సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిలు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప పిలుపు నిచ్చారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సహాయక కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఏఐయూటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న హాజరై తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, ఆత్మగౌరవం అని తెలిసీ కూడా కూటమి నాయకులు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు నిరసన దీక్షలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు.